

## సురభికి కాంస్యం

న్యూఢిల్లీ: జాతీయ షూటింగ్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ యువ షూటర్ రావూరి సురభి భరద్వాజ్ కాంస్య పతకంతో మెరిసింది. బుధవారం జరిగిన మహిళల 50మీటర్ల రైఫిల్ ప్రోన్ ఈవెంట్‌లో బరిలోకి దిగిన సురభి 620 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచింది. ఇదే విభాగంలో పోటీపడ్డ మాన్ని కౌశిక్ (626), సిఫ్ట్‌కౌర్ సమ్రా(622) వరుసగా స్వర్ణ, రజత పతకాలు కైవసం చేసుకున్నారు. ఇదే టోర్నీలో రాష్ట్రానికి చెందిన దవళిక దేవి జూనియర్ విభాగంలో పతకం సాధించింది.

## హెచ్‌సీఏకు ఊరట

**ఆర్థిక నిర్ణయాలు వద్దన్న ఉత్తర్వులపై స్టే**



హైదరాబాద్, ఏప్రిల్ 30, (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) నిధుల వినియోగానికి సంబంధించి పాలకవర్గంపై ఆరోపణల నేపథ్యంలో ఆర్థిక పరమైన విధాన నిర్ణయాలు తీసుకోరాదని గతంలో సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వుల అమలును నిలిపివేస్తూ డివిజన్ బెంచ్ స్టే ఆదేశాలు జారీ చేసింది. హెచ్‌సీఏ నిధుల దుర్వినియోగంపై దర్యాప్తు జరిపించాలని సీబీఐ, ప్రభుత్వానికి ఫిర్యాదు చేసినప్పటికీ చర్యలు లేవంటూ తెలంగాణ క్రికెట్ అసోసియేషన్(టీసీఏ) దాఖలు చేసిన కేసులో సింగిల్ జడ్జి ఆర్థికపరమైన విధాన నిర్ణయాలు తీసుకోరాదని హెచ్‌సీఏను ఆదేశించారు. ఈ ఉత్తర్వులను సవాలు చేస్తూ హెచ్‌సీఏ దాఖలు చేసిన అప్పీల్ పిటిషన్‌ను తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజయ్ పాల్, జస్టిస్ రేణుక యారా ధర్మాసనం బుధవారం విచారించింది. పిటిషన్‌లో లేని అంశాల జోలికి వెళ్లి సింగిల్ జడ్జి ఆదేశాలు ఇచ్చారని పేర్కొంది. అప్పీల్‌లోని ప్రతివాదులకు నోటీసులు ఇచ్చింది. విచారణను జూన్ నెలకు వాయిదా వేసింది.

**చాహల్ హ్యాట్రిక్ వికెట్లతో విజృంభణ**


# చెన్నై ఔట్

**రాణించిన అయ్యర్, ప్రభ్‌సిమ్రన్**

**పంజాబ్ కింగ్స్ ఘన విజయం**



చాహల్ (4/32)



అయ్యర్ (72)

### సంక్షిప్త స్కోర్లు

చెన్నై: 19.2 ఓవర్లలో 190 ఆలౌట్ (కరన్ 88, బ్రెవిస్ 32, చాహల్ 4/32, అర్ష్‌దీప్ 2/25); **పంజాబ్:** 19.4 ఓవర్లలో 194/6(అయ్యర్ 72, ప్రభ్‌సిమ్రన్ 54, ఖలీల్ 2/28, పతిరన 2/45)

చెన్నై: పంజాబ్ కింగ్స్ సమిష్టి ప్రదర్శనతో అదరగొట్టింది. ప్లేఆఫ్స్ రేసులో నిలువాలంటే కచ్చితంగా గెలువాల్సిన మ్యాచ్‌లో చెన్నైపై పంజా విసిరింది. శనివారం జరిగిన మ్యాచ్‌లో పంజాబ్ 4 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. సొంత ఇలాఖాలో వరుసగా ఐదో ఓటమిని ఖాతాలో వేసుకున్న చెన్నై ప్లేఆఫ్స్ రేసు నుంచి అధికారికంగా నిష్క్రమించింది. చెన్నై నిర్దేశించిన 191 పరుగుల లక్ష్యాన్ని పంజాబ్ 19.4 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 194 పరుగులు చేసింది. కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్(41 బంతుల్లో 72, 5ఫోర్లు, 4సిక్స్‌లు), ప్రభ్‌సిమ్రన్‌సింగ్(36 బంతుల్లో 54, 5ఫోర్లు, 3సిక్స్‌లు) అర్ధసెంచరీలతో అదరగొట్టారు. పతిరన(2/45), ఖలీల్(2/28) రెండేసి వికెట్లు తీశారు. తొలుత టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేసిన చెన్నై.. 19.2 ఓవర్లలో 190 పరుగుల భారీ స్కోరు చేసింది. సామ్ కరన్ (47 బంతుల్లో 88, 9 ఫోర్లు, 4 సిక్సర్లు), డెవాల్డ్ బ్రెవిస్ (32) రాణించారు. కింగ్స్ బౌలర్లలో యుజ్వేంద్ర చాహల్ (4/32) ఈ సీజన్‌లో తొలి హ్యాట్రిక్‌ను నమోదు చేయగా అర్ష్‌దీప్ (2/25), యాన్సెన్ (2/30) తలా రెండు వికెట్లు పడగొట్టారు. అయ్యర్‌కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది.

**కింగ్స్ దూకుడు**

యువ ఓపెనర్లు ప్రియాన్ష్, ప్రభ్‌సిమ్రన్ ఆరంభం నుంచే దూకుడు మంత్రాన్ని జపించడంతో పంజాబ్ స్కోరు బోర్డు పరుగులు పెట్టింది. ఖలీల్ తొలి ఓవర్లోనే ప్రియాన్ష్ రెండు బౌండరీలతో ఇన్నింగ్స్‌ను ఆరంభించగా అన్షుల్ నాలుగో ఓవర్లో ప్రభ్‌సిమ్రన్ 6, 4 దంచాడు. ఖలీలే వేసిన 5వ ఓవర్లో రెండు ఫోర్లు కొట్టిన ప్రియాన్ష్.. నాలుగో బంతికి ధోనికి క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. పవర్ ప్లే తర్వాత స్పిన్నర్ల రాకతో కింగ్స్ స్కోరు వేగం కాస్త నెమ్మదించింది. పతిరాన 11వ ఓవర్లో ఆఖరి బంతిని బ్యాక్‌వర్డ్ పాయింట్ దిశగా బౌండరీకి తరలించిన ప్రభ్‌సిమ్రన్.. ఈ సీజన్‌లో మూడో హాఫ్ సెంచరీని పూర్తిచేశాడు. క్రీజులో ఉన్నంతసేపు ధాటిగా ఆడిన ప్రభ్‌సిమ్రన్..నూర్ అహ్మద్ బౌలింగ్‌లో రెండో వికెట్‌గా వెనుదిరిగాడు. ప్రభ్‌సిమ్రన్‌ను అనుసరిస్తూ నేహల్ వధేరా(5) స్వల్ప స్కోరుకే పెవిలియన్ చేరాడు. ఓ వైపు సహచరులు నిష్క్రమిస్తున్నా..అయ్యర్ కెప్టెన్ ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్నాడు. చెన్నై బౌలర్లను చెడుగుడు ఆడుకుంటూ లక్ష్యాన్ని అంతకంతకూ కరిగించుకుంటూ పోయాడు. ఆఖర్లో పది పరుగుల తేడాతో మూడు కీలక వికెట్లు శశాంక్(23), అయ్యర్, సూర్యాంశ్(1) చేజార్చుకున్నా..పంజాబ్ విజయతీరాలకు చేరింది.

**కరన్ కుమ్మేశాడు**

చెన్నై ఇన్నింగ్స్‌లో కరన్ ఆటే హైలైట్. 6 ఓవర్లలో మూడు కీలక వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడ్డ సీఎస్‌కేను బ్రెవిస్ అండతో అతడు ఆదుకున్నాడు. ఈ ఇద్దరూ తప్ప చెన్నై బ్యాటర్లలో ఒక్కరు కూడా 20 పరుగుల మార్కును దాటలేదు. ఈ సీజన్‌లో సరైన ఆరంభాలు లేక తంటాలు పడుతున్న చెన్నైకి ఈ మ్యాచ్‌లోనూ ఆ తిప్పలు తప్పలేదు. యువ ఓపెనర్లు రషీద్ (11), ఆయుశ్ (7) విఫలమవగా.. నాలుగో స్థానంలో వచ్చిన జడేజా (17) నాలుగు బౌండరీలతో అలరించినా అతడూ ఎక్కువసేపు క్రీజులో నిలువలేకపోయాడు. పవర్ ప్లేలో చెన్నై చేసిన స్కోరు 48/3. ఈ క్రమంలో కరన్.. సీఎస్‌కే తనమీద ఉంచిన నమ్మకాన్ని నిలబెడుతూ కీలక ఇన్నింగ్స్ ఆడాడు. హర్‌ప్రీత్ బ్రర్ 8వ ఓవర్లో సిక్స్ బాదిన అతడు.. చాహల్ బౌలింగ్‌లో బ్యాక్‌టు బ్యాక్ బౌండరీలు కొట్టాడు. కరన్‌కు అండగా నిలిచిన బ్రెవిస్.. క్రీజులో కుదురుకుంటున్న తరుణంలో 15వ ఓవర్లో అజ్మతుల్లా అతడిని బౌల్డ్ చేయడంతో 78 పరుగుల నాలుగో వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది. అదే ఓవర్లో మూడో బంతికి డబుల్ తీసి హాఫ్ సెంచరీ సాధించిన కరన్ ఆ తర్వాత మరింత రెచ్చిపోయాడు. షెడ్గే వేసిన మరుసటి ఓవర్లో అతడు 6, 6, 4, 4తో ఏకంగా 26 రన్స్ రాబట్టాడు. ఒక ఓవర్లో చెన్నై ఇన్ని పరుగులు చేయడం ఈ సీజన్‌లో ఇదే ప్రథమం. కరన్‌తో పాటు దూబె కూడా క్రీజులో ఉండటంతో చెన్నై జోరు చూస్తే 220 ప్లస్ దాటుతుందేమో అనిపిస్తుంది. కానీ యాన్సన్ బౌలింగ్‌లో కరన్ ఔట్ అవడంతో ఆ జట్టు బ్యాటింగ్ లైనప్ కుదేలైంది.

**చాహల్ హ్యాట్రిక్**

కరన్ నిష్క్రమించినా దూబెతో పాటు ధోని (11) క్రీజులో ఉండటంతో చెన్నై భారీ స్కోరే సాధిస్తుందని అభిమానులు ఆశించారు. కానీ 18వ ఓవర్లో చాహల్.. 4 కీలక వికెట్లు (ఇందులోనే హ్యాట్రిక్) పడగొట్టి చెన్నైని కట్టడిచేశాడు. రెండో బంతికి ధోనిని ఔట్ చేసిన అతడు.. 4, 5, 6 బంతుల్లో హుడా (2), కంబోజ్, నూర్ అహ్మద్‌ను ఔట్ చేసి ఈ సీజన్‌లో తొలి, మొత్తంగా తన కెరీర్‌లో రెండో హ్యాట్రిక్‌ను నమోదుచేశాడు.



## 'చంపక్'పై బీసీసీఐకి నోటీసులు

ఢిల్లీ: ఐపీఎల్-18 సందర్భంగా మైదానాల్లో అలరిస్తున్న ఏఐ రోబోటిక్ డాగ్ 'చంపక్' పేరు బీసీసీఐకి కొత్త తలనొప్పులను తీసుకొచ్చింది. ఈ సీజన్ 29వ మ్యాచ్ సందర్భంగా దీనిని ప్రవేశపెట్టిన బీసీసీఐ.. ఫ్యాన్ పోల్ ద్వారా దానికి చంపక్ అన్న పేరు పెట్టింది. అయితే ఈ పేరుపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ చిన్నపిల్లల మ్యాగజైన్ 'చంపక్' ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించింది. ఇది తమ ట్రేడ్ మార్క్ ఉల్లంఘన అవుతుందని 'చంపక్' కోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌లో పేర్కొంది. దీనిపై జూలై 9 నాటికి రాతపూర్వక వివరణ ఇవ్వాలంటూ బీసీసీఐని కోర్టు ఆదేశించింది.

**3** ఐపీఎల్‌లో ఒకటి కంటే ఎక్కువసార్లు హ్యాట్రిక్ తీసిన వారిలో చాహల్ మూడోవాడు. అమిత్ మిశ్రా (2008, 2011, 2013 సీజన్లలో) మూడుసార్లు ఈ ఘనత సాధించగా యువరాజ్ సింగ్ 2009 సీజన్‌లో రెండు సార్లు హ్యాట్రిక్ పడగొట్టాడు. చాహల్.. 2022, 2025లో ఈ ఘనత సాధించాడు

**1** చెపాక్‌లో చెన్నై వరుసగా ఐదు మ్యాచ్‌లు ఓడిపోవటం ఇది తొలిసారి

**వరుస సీజన్లలో చెన్నై ప్లేఆఫ్స్‌కు అర్హత సాధించకపోవడం ఇది మొదటిసారి**

### పాయింట్ల పట్టిక

| జ | మ్యా | గె | ఓ | ఫ.తే | పా | ర.రే |
|---|---|---|---|---|---|---|
| బెంగళూరు | 10 | 7 | 3 | 0 | 14 | 0.52 |
| పంజాబ్ | 10 | 6 | 3 | 1 | 13 | 0.19 |
| ముంబై | 10 | 6 | 4 | 0 | 12 | 0.88 |
| గుజరాత్ | 9 | 6 | 3 | 0 | 12 | 0.74 |
| ఢిల్లీ | 10 | 6 | 4 | 0 | 12 | 0.36 |
| లక్నో | 10 | 5 | 5 | 0 | 10 | -0.03 |
| కోల్‌కతా | 10 | 4 | 5 | 1 | 9 | 0.27 |
| రాజస్థాన్ | 10 | 3 | 7 | 0 | 6 | -0.34 |
| హైదరాబాద్ | 9 | 3 | 6 | 0 | 6 | -1.10 |
| చెన్నై | 10 | 2 | 8 | 0 | 4 | -1.21 |

నోట్: జ- జట్టు, మ్యా. మ్యాచ్, గె-గెలుపు, ఓ-ఓటమి, ఫ.తే-ఫలితం తేలనిది పా-పాయింట్లు, ర.రే-రన్‌రేట్

## వైభవ్‌కు పియాస్ట్రి ప్రశంసలు



జైపూర్: రాజస్థాన్ రాయల్స్ చిన్నోడు, ఐపీఎల్‌లో రికార్డు శతకంతో చరిత్ర సృష్టించిన వైభవ్ సూర్యవంశీ ప్రశంసల జడివానలో తడిసి ముద్దవుతున్నాడు. గుజరాత్ టైటాన్స్‌తో మ్యాచ్‌లో 35 బంతుల్లోనే శతకం బాదిన వైభవ్ ఆటకు భారత క్రికెటర్లతో పాటు ప్రముఖ ఎఫ్1 రేసర్ ఆస్కార్ పియాస్ట్రి (ఆస్ట్రేలియా) సైతం ముగ్ధుడయ్యాడు. తాజాగా ఈ మెక్‌లారెన్ డ్రైవర్ తన ఇన్‌స్టా రీల్స్‌లో.. వైభవ్ ఫొటోతో కూడిన రీల్‌ను షేర్ చేశాడు. ఈ రీల్‌కు అతడి వయసును సూచించేలా '14' అని రాసి పక్కనే క్లాప్స్ కొడుతున్న ఎమోజీని ఉంచాడు. క్రికెట్ అభిమాని అయిన పియాస్ట్రి.. గతంలో పలుమార్లు తనకు ఈ ఆట, ఆటగాళ్లపై ఉన్న అభిమానాన్ని బహిరంగంగానే వెల్లడించిన విషయం తెలిసిందే.

## వచ్చే ఆసియా క్రీడల్లోనూ క్రికెట్‌కు చోటు



ఢిల్లీ: వచ్చే ఏడాది జపాన్ వేదికగా జరగాల్సి ఉన్న ఆసియా క్రీడల్లోనూ క్రికెట్ తన స్థానాన్ని నిలుపుకుంది. తొమ్మిదేండ్ల విరామం తర్వాత 2023 హాంగ్జౌ (చైనా)లో జరిగిన ఆసియా క్రీడల్లో తిరిగి చోటు దక్కించుకున్న క్రికెట్.. తన స్థానాన్ని నిలుపుకున్నదని తాజాగా ఒలింపిక్ కౌన్సిల్ ఆఫ్ ఆసియా (ఓసీఏ) బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. 2026 సెప్టెంబర్-అక్టోబర్ మధ్య జపాన్‌లోని ఐచి-నగోయలో ఆసియా క్రీడలు జరుగనున్నాయి. ఈ మేరకు ఓసీఏతో పాటు ఆసియా క్రీడల నిర్వహణ కమిటీ నగోయలో నిర్వహించిన సమావేశంలో.. క్రికెట్‌తో పాటు మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్‌కూ ఆమోదం లభించినట్టు వెల్లడించింది. హాంగ్జౌలో భారత పురుషుల, మహిళల జట్లు స్వర్ణ పతకాలు సాధించిన విషయం తెలిసిందే.

## బంగ్లాదే రెండో టెస్టు

**సిరీస్ సమం**



చత్తోగ్రామ్: స్వదేశంలో జింబాబ్వేతో తొలి టెస్టులో ఎదురైన ఓటమికి రెండో టెస్టులో బంగ్లాదేశ్ బదులు తీర్చుకుంది. చత్తోగ్రామ్ వేదికగా మూడు రోజుల్లోనే ముగిసిన రెండో టెస్టులో బంగ్లా ఇన్నింగ్స్ 106 పరుగుల తేడాతో ఘన విజయం సాధించి రెండు మ్యాచ్‌ల సిరీస్‌ను 1-1తో సమం చేసింది. షాద్మన్ (120)తో పాటు మెహిదిహసన్ మిరాజ్ (104) శతకాలతో కదం తొక్కడంతో తొలి ఇన్నింగ్స్‌లో ఆ జట్టు 444 పరుగుల భారీ స్కోరు చేసింది. దీంతో ఆ జట్టు 217 పరుగుల భారీ ఆధిక్యం సాధించింది. అనంతరం రెండో ఇన్నింగ్స్ ఆడిన జింబాబ్వే.. 46.2 ఓవర్లలో 111 రన్స్‌కే ఆలౌట్ అయింది. బెన్ కరన్ (46) టాప్ స్కోరర్. బ్యాటింగ్‌లో సెంచరీ చేసిన మిరాజ్.. బంతితోనూ ఐదు (5/32) వికెట్లు పడగొట్టి బంగ్లా విజయంలో కీలకపాత్ర పోషించాడు. మిరాజ్‌కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్'తో పాటు 'మ్యాన్ ఆఫ్ ద సిరీస్' దక్కాయి.

## చిన్న నగరాల్లో ఐకియా స్టోర్లు




న్యూఢిల్లీ, ఏప్రిల్ 30: స్వీడన్‌కు చెందిన గృహోపకరణాల విక్రయ సంస్థ ఐకియా..తన వ్యాపార పంథాను మార్చుకుంటున్నది. ఇప్పటికే మెట్రో నగరాలకు పరిమితమైన సంస్థ..తాజాగా చిన్న నగరాలకు విస్తరించాలని నిర్ణయించింది. మరింత మంది కస్టమర్లకు చేరువకావాలనే ఉద్దేశంతో చిన్న స్థాయి స్టోర్లను ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్టు ఐకియా ఇండియా కంట్రీ మేనేజర్ పూజా గ్రోవర్ తెలిపారు. 10 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఈ స్టోర్లను నెలకొల్పాలనుకుంటున్నట్టు, ఈ స్టోర్లలో 7 వేలకు పైగా వస్తువులను విక్రయించనున్నట్టు చెప్పారు. హోమ్ డెలివరీ సేవలతోపాటు కలెక్షన్ పాయింట్ల వద్ద పికప్ లేదా థర్డ్ పార్టీ పికప్ ద్వారా కస్టమర్లు బుకింగ్ చేసుకున్న వస్తువులను వారి ఇంటికి సరఫరా చేయనున్నట్టు ప్రకటించారు. చిన్న స్టోర్లతోపాటు హైదరాబాద్, బెంగళూరు, ముంబై, ఢిల్లీ-ఎన్‌సీఆర్, చెన్నై, పుణెలలో ఏర్పాటు చేసిన అతిపెద్ద స్టోర్లపై కూడా ప్రత్యేక దృష్టి సారించనున్నది.

## ఊగిసలాటలో సూచీలు

ముంబై, ఏప్రిల్ 30: దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా రెండో రోజు నష్టపోయాయి. తీవ్ర ఊగిసలాటలో కొనసాగిన సూచీలకు ఉద్రిక్తత పరిస్థితులు నెలకొనడం, బజాజ్ షేర్లలో భారీగా అమ్మకాలు జరగడం సూచీలు నష్టాల్లోకి జారుకున్నాయి. విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు నిధులు కుమ్మరించినప్పటికీ సూచీలు నష్టపోవడం విశేషం. 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ 46.14 పాయింట్లు కోల్పోయి 80,242.24 వద్ద ముగియగా, మరో సూచీ నిఫ్టీ 1.75 పాయింట్లు తగ్గి 24,334.20 వద్ద ముగిసింది. టాటా మోటర్స్, ఎస్బీఐ, అల్ట్రాటెక్ సిమెంట్, టీసీఎస్, టాటా స్టీల్, ఏషియన్ పెయింట్స్ షేర్లు నష్టపోగా..మారుతి, భారతీ ఎయిర్‌టెల్, పవర్‌గ్రిడ్, హెచ్‌యూఎల్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేర్లు లాభాల్లో ముగిశాయి. మహారాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా గురువారం స్టాక్ మార్కెట్లు సెలవుపాటించనున్నాయి.

## సంస్థ మారేందుకు సై!

**వచ్చే ఏడాదికాలంలో కంపెనీలను మార్చే యోచనలో మెజారిటీ ఉద్యోగులు**

**ఏవోఎన్ సర్వేలో వెల్లడి**



న్యూఢిల్లీ, ఏప్రిల్ 30: దేశంలోని ఉద్యోగుల్లో చాలామంది ఇప్పుడున్న కంపెనీలను వీడే యోచనలో ఉన్నట్టు ఓ తాజా సర్వేలో తేలింది. వచ్చే ఏడాదికాలంలో కొత్త సంస్థల్లో చేరేందుకే మెజారిటీ వర్కర్లు ఆసక్తి చూపుతున్నారని ప్రముఖ గ్లోబల్ ప్రొఫెషనల్ సర్వీసెస్ సంస్థ ఏవోఎన్ నిర్వహించిన అధ్యయనంలో వెల్లడైంది. ఈ ఏడాదికిగాను చేపట్టిన ఈ ఎంప్లాయీ సెంటిమెంట్ స్టడీలో పాల్గొన్నవారిలో 82 శాతం మంది ఇప్పుడున్న యాజమాన్యాన్ని వదిలి కొత్త యాజమాన్యం కిందకు వెళ్లాలనే భావిస్తున్నారని స్పష్టమైంది. ప్రపంచవ్యాప్తంగా తీసుకుంటే ఇది 60 శాతంగా ఉన్నది. భారత్, అమెరికా, చైనా, బ్రిటన్, ఆస్ట్రేలియా తదితర 23 దేశాల్లో ఈ సర్వే జరిగింది. 9 వేలకుపైగా ఉద్యోగుల అభిప్రాయాలను తీసుకున్నారు. ఈ క్రమంలోనే భారత్‌లో ఎక్కువమంది ప్రస్తుత కంపెనీల్లో ఉద్యోగాలను మానేసి కొత్త కంపెనీల్లో వెతుక్కోవాలని ఆలోచిస్తున్నారు. ఇక 7 శాతం మంది తమకు తక్కువ వేతనాలు వస్తున్నట్టు ఆవేదన చెందుతున్నారు. ఇలా అనేక అసంతృప్తుల నడుమ జాబ్ చేంజ్‌కే అధికులు మొగ్గు చూపుతున్నట్టు సర్వే పేర్కొన్నది.

**చిన్న సంస్థలే దన్ను**

దేశీయ సేవల రంగంలో పనిచేస్తున్న ఉద్యోగుల్లో 63.03 శాతం మంది రూ.500 కోట్ల కంటే తక్కువ ఉత్పత్తిని చేస్తున్న కంపెనీల్లోనే ఉన్నట్టు బుధవారం విడుదలైన ప్రభుత్వ సర్వే తెలియజేసింది. పైలట్ ప్రాజెక్టు కింద తొలిసారి జరిగిన ఈ సర్వేలో రూ.500 కోట్ల కంటే ఎక్కువ ఉత్పత్తి చేస్తున్న కంపెనీలు ఉపాధినివ్వడం కన్నా ఆస్తుల్ని పెంచుకోవడంలోనే కీలకంగా ఉన్నాయని తేలింది. సేవా రంగ సంస్థల ఆస్తుల్లో 62.77 శాతం వాటా బడా సంస్థలకు చెందినవే మరి. సేవా రంగ సంస్థల వార్షిక సర్వే పేరిట కేంద్ర గణాంకాలు, కార్యాచరణ మంత్రిత్వ శాఖ ఈ అధ్యయనాన్ని చేసింది.

**అక్షయ తృతీయ అమ్మకాలు అదుర్స్**

# తగ్గేదేలే

**జోరుగా సాగిన కొనుగోళ్లు • ప్రభావం చూపని అధిక ధరలు**

**అమ్మకాల వృద్ధిపై జ్యుయెల్లర్స్ ఆనందం**

**సేల్స్ వాల్యూ 35% పెరగవచ్చంటున్న జీజేసీ**



న్యూఢిల్లీ, ఏప్రిల్ 30: అక్షయ తృతీయ కొనుగోళ్లు అంచనాలను మించి జరిగాయి. అధిక ధరలున్నా బంగారం అమ్మకాలు బాగానే జరిగాయని జ్యుయెల్లర్స్ వెల్లడించారు. ఈ క్రమంలోనే గత ఏడాదితో పోల్చితే ఈ ఏడాది విక్రయాల విలువ 35 శాతం పెరుగుతుందన్న అంచనాను అఖిల భారత రత్నాలు, ఆభరణాల మండలి (జీజేసీ) వ్యక్తం చేస్తున్నది. నిరుడు 20 టన్నుల మేర సేల్స్ జరిగాయి. నిజానికి గతకొద్ది రోజులుగా ధరలు పెరుగుతూపోవడంతో కొనేందుకు అంతా సందేహించారని, అయితే ఇప్పుడు రేట్లలో స్థిరీకరణ రావడంతో కస్టమర్లు దుకాణాలకు పెద్ద ఎత్తున వచ్చారని జీజేసీ చైర్మన్ రాజేశ్ రోకెడె పీటీఐకి తెలిపారు. కాగా, గత ఏడాది అక్షయ తృతీయ రోజు (మే 10, 2024)న తులం బంగారం రూ.72,300గా ఉన్నది. అయితే ఇప్పుడిది రూ.98,550 పలికింది. అయినప్పటికీ కస్టమర్లు కొనేందుకే ముందుకురావడంపట్ల జ్యుయెల్లర్స్ ఆనందం వెలిబుచ్చుతున్నారు.

**12 టన్నుల మేర..**

దాదాపు 12 టన్నుల బంగారం అమ్మకాలు జరుగవచ్చని అఖిల భారత వర్తకుల సమాఖ్య అంచనా వేస్తున్నది. దీని విలువ రూ.12,000 కోట్లుగా ఉండొచ్చని చెప్తున్నది. అలాగే రూ.4,000 కోట్ల విలువైన 400 టన్నుల వెండి విక్రయాలు జరిగాయని భావిస్తున్నది. మొత్తంగా ఈ ఒక్కరోజే రూ.16,000 కోట్ల విలువైన వ్యాపారం జరిగిందన్న సమాచారం తమకు అందుతున్నట్టు ట్రేడర్స్ పేర్కొంటున్నారు. ఇక ఉదయం సమయంలో దుకాణాల్లో కాస్త కస్టమర్ల సందడి తక్కువగానే ఉన్నా.. మధ్యాహ్నం నుంచి పుంజుకుందని, సాయంత్రం ఇంకా పెరిగిందని జ్యుయెల్లర్స్ తెలిపారు. చాలా నగరాల్లో అర్ధరాత్రి దాకా విక్రయాలు జరుగడం గమనార్హం.

**కడ్డీలు, నాణేలకు డిమాండ్**

వినియోగదారుల్లో 25-40 ఏండ్ల వయస్సు వారు గోల్డ్, సిల్వర్ కడ్డీలు, నాణేలను కొనేందుకే ఎక్కువగా ఆసక్తి చూపినట్టు నగల వ్యాపారులు వెల్లడించారు. అయితే బడ్జెట్, అవసరాన్నిబట్టి ఆభరణాలు, నాణేలు, కడ్డీలకు డిమాండ్ కనిపించినట్టు తెలియజేశారు. ఇక పాత బంగారు నగలు ఇచ్చి కొత్త బంగారం నగలను కొనుక్కునేవారు కూడా ఈసారి పెరిగారని, తమకు సుమారు 50 శాతం సేల్స్ అలాగే జరిగాయని పీఎన్‌జీ జ్యుయెల్లర్స్ చైర్మన్ సౌరభ్ గాడ్గిల్ తెలిపారు.

**మార్కెట్‌లో తగ్గిన ధరలు**

దేశీయ మార్కెట్‌లో బుధవారం బంగారం ధరలు క్షీణించాయి. ఢిల్లీలో 24 క్యారెట్ (99.9 స్వచ్ఛత) 10 గ్రాముల విలువ రూ.98,550గా ఉన్నది. మంగళవారంతో పోల్చితే రూ.900 పడిపోయింది. అంతర్జాతీయ మార్కెట్లలో బలహీన ట్రెండ్ ఇందుకు కారణంగా అఖిల భారత సరఫా అసోసియేషన్ పేర్కొంటున్నది. కాగా, కిలో వెండి ధర ఏకంగా ఈ ఒక్కరోజే రూ.4,000 దిగింది. రూ.98,000కు పరిమితమైంది. అంతర్జాతీయంగా చూస్తే.. స్పాట్ మార్కెట్‌లో ఔన్స్ 3,273.90 డాలర్లు పలికింది. 43.35 డాలర్లు తగ్గుముఖం పట్టింది. వెండి కూడా 32.33 డాలర్లుగానే ఉన్నది. ఇదిలావుంటే హైదరాబాద్‌లో 24 క్యారెట్ తులం రూ.97,910గా ఉన్నది. రూ.60 తగ్గింది. 22 క్యారెట్ (99.5 స్వచ్ఛత) పుత్తడి రేటు రూ.50 దిగి రూ.89,750గా ఉన్నది.

**పడిపోయిన డిమాండ్**

ఈ ఏడాది జనవరి-మార్చి త్రైమాసికంలో దేశీయంగా బంగారానికి డిమాండ్ పడిపోయినట్టు ప్రపంచ స్వర్ణ మండలి (డబ్ల్యూజీసీ) బుధవారం తెలిపింది. నిరుడుతో పోల్చితే పసిడికి 15 శాతం ఆదరణ క్షీణించినట్టు తమ తాజా నివేదికలో వెల్లడించింది. ఈ 3 నెలల్లో గరిష్ఠంగా 24 క్యారెట్ 10 గ్రాముల ధర రూ.94,030 పలికింది. ఈ క్రమంలోనే 118.1 టన్నులకే గోల్డ్ డిమాండ్ పరిమితమైంది. కాగా, ఈ ఏడాది మొదలు ఇప్పటిదాకా పుత్తడి రేట్లు భారతీయ మార్కెట్‌లో 25 శాతం పుంజుకున్నాయి. తులం లక్ష రూపాయల మార్కునూ దాటేసింది. ఈ నేపథ్యంలో ఈ సంవత్సరం దేశీయంగా గోల్డ్ డిమాండ్ 700-800 టన్నుల మధ్య ఉండొచ్చని డబ్ల్యూజీసీ అంచనా వేస్తున్నది. రాబోయే పెండ్లిళ్ల సీజన్ కలిసిరావచ్చన్న అభిప్రాయాన్ని ఈ సందర్భంగా డబ్ల్యూజీసీ ఇండియా సీఈవో సచిన్ జైన్ వ్యక్తం చేశారు. అయితే అధిక ధరల వల్ల కొనుగోలుదారులు వేచిచూసే ధోరణిని అవలంబిస్తున్నారని, తేలికపాటి నగల కొనుగోళ్లకు ఆసక్తి చూపుతున్నారని వ్యాపారులు చెప్తున్నారు.

### వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ నివేదికలో..

- *బంగారంపై పెట్టుబడులు 7 శాతం పెరిగి 46.7 టన్నులకు చేరాయి. గత ఏడాది ఇదే వ్యవధిలో 43.6 టన్నులుగా ఉన్నాయి.*
- *స్టాక్ మార్కెట్లు తీవ్ర ఒడిదొడుకులకు గురవడంతో మదుపరులు పుత్తడి వైపునకు తమ పెట్టుబడులను మళ్లించారు. బంగారం కడ్డీలు, నాణేలకు డిమాండ్ పెరిగింది.*
- *నగలకు 25 శాతం ఆదరణ పడిపోయింది. ఈసారి 71.4 టన్నులకే సేల్స్ పరిమితమయ్యాయి. నిరుడు 95.5 టన్నులు.*
- *పసిడి దిగుమతులు 8 శాతం పుంజుకొని 167.4 టన్నులుగా నమోదయ్యాయి. రీసైక్లింగ్ 32 శాతం పతనమై 26 టన్నులు.*
- *ఈ త్రైమాసికంలో సగటున బంగారం ధర తులం రూ.79,633.40 పలికింది. నిరుడు జనవరి-మార్చిలో ఇది రూ.55, 247.20 గా ఉన్నది.*
- *ప్రపంచవ్యాప్తంగా గోల్డ్ డిమాండ్ ఈ జనవరి-మార్చిలో 1 శాతం పెరిగి 1,206 టన్నులకు చేరింది. 2019 తర్వాత తొలి త్రైమాసికంలో ఈ స్థాయి డిమాండ్ కనిపించడం ఇదే మొదటిసారి.*

## అమెరికా ఆర్థికానికి బీటలు

**• తొలి త్రైమాసికంలో 0.3 శాతం వృద్ధి**

వాషింగ్టన్, ఏప్రిల్ 30: అగ్రరాజ్యం అమెరికా ఆర్థిక వ్యవస్థకు బీటలు పడ్డాయి. ఈ ఏడాది తొలి త్రైమాసికానికిగాను(జనవరి-మార్చి మధ్యకాలంలో) వృద్ధిరేటు 0.3 శాతంగా నమోదైంది. గడిచిన మూడేండ్లలో ఇదే తక్కువ స్థాయి వృద్ధిరేటు. 202 ప్రతీకార సుంకాల విధింపునకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మొగ్గుచూపడంతో దేశ ఆర్థిక వ్యవస్థ కుప్పకూలిందని, ముఖ్యంగా దిగుమతులు తగ్గుముఖం పట్టాయని తెలిపింది. గతేడాది చివరి త్రైమాసికంలో నమోదైన 2.4 శాతం కంటే భారీగా తగ్గిందని తెలిపింది. ట్రంప్ సుంకాల విధింపుతో దిగుమతులు 5 శాతం పడిపోవడం వృద్ధిరేటు తగ్గడానికి ప్రధాన కారణమని తెలిపింది. దీంతోపాటు వినియోగదారులు ఖర్చులు తగ్గించుకోవడానికి అధిక ప్రాధాన్యతనివ్వడం కూడా వృద్ధి పరుగుకు బ్రేక్‌లు వేశాయని



వెల్లడించింది. దీంతో అమెరికా స్టాక్ మార్కెట్లు కుప్పకూలాయి. ఎస్అండ్‌పీ 500 సూచీ 2 శాతం పడిపోగా, డౌజోన్స్ 702 పాయింట్లు లేదా 1.7 శాతం పతనం చెందింది.

## సిగ్నీస్ ఎనర్జీ గిగాఫ్యాక్టరీ

హైదరాబాద్, ఏప్రిల్ 30: సిగ్నీస్ ఎనర్జీ..హైదరాబాద్‌లో 4.8 గిగావాట్ల బెస్ గిగాఫ్యాక్టరీని ప్రారంభించింది. రూ.100 కోట్ల పెట్టుబడితో ఐదు ఎకరాల క్యాంపస్‌లో 1.60 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో నెలకొల్పింది. కంపెనీ సీఈవో వెంకట్ రాజారామన్ మాట్లాడుతూ..ఈ గిగాఫ్యాక్టరీ కోసం తొలి విడుత రూ.100 కోట్లు, రెండో విడుత మరో రూ.250 కోట్లు ఇన్వెస్ట్ చేయాలనుకుంటునట్టు చెప్పారు.

## వాణిజ్య



### భారీగా స్కోడా కార్ల రీకాల్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 30: వాహన సంస్థ స్కోడా ఆటో ఫోక్స్‌వ్యాగన్ 47 వేల యూనిట్ల వాహనాలను రీకాల్ చేస్తున్నట్టు ప్రకటించింది. వీటిలో టైగన్, వర్టస్, కుషక్యూ మాడళ్లు ఉన్నాయి. వెనుక సీటు బెల్ట్ తయారీలో లోపం తలెత్తడంతో సంస్థ ఈ నిర్ణయం తీసుకున్నట్టు ఆటోమొబైల్ తయారీదారుల సంఘం(సియామ్) వెల్లడించింది వీటిలో మే 24, 2024 నుంచి ఏప్రిల్ 1, 2025 వరకు తయారైన 21,513 యూనిట్ల టైగన్, వర్టస్ మాడళ్లు ఉన్నాయి. అలాగే 25,722 యూనిట్ల కుషక్యూ, స్లావియా, కైలాఖ్ మాడళ్లు ఉన్నాయి.

### సింగరేణి అభివృద్ధికి తోడ్పాటు అందించండి

**• సీఎస్‌ను కోరిన సీఎండీ బలరామ్**

హైదరాబాద్, ఏప్రిల్ 30 (నమస్తే తెలంగాణ) : సింగరేణి సంస్థ అభివృద్ధికి తోడ్పాటు అందించాలని నూతన సీఎస్ రామకృష్ణారావును సింగరేణి సీఎండీ ఎన్ బలరామ్ కోరారు. ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా సచివాలయంలో సీఎస్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఆర్థికశాఖ స్పెషల్ సీఎస్ హోదాలో సింగరేణి బోర్డ్ ఆఫ్ డైరెక్టర్‌గా ఉంటూ సంస్థ అభివృద్ధికి సహకరించారని ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు.

### ఎయిర్‌టెల్ సిమ్ డెలివరీ సేవలు నిలిపివేత

న్యూఢిల్లీ, ఏప్రిల్ 30: ఇంటికే సిమ్ డెలివరీ సేవలను అట్టహాసంగా ప్రారంభించిన ఎయిర్‌టెల్ ఈ సేవలను అర్ధాంతరంగా నిలిపివేసినట్టు తెలుస్తున్నది. డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెలికం మంత్రిత్వ శాఖ పలు అభ్యంతరాలు వ్యక్తంచేయడంతో ఈ సేవలను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్టు ప్రకటించింది. సిమ్ బుక్ చేసుకున్నవారికి వెంటనే అందించాలనే ఉద్దేశంతో ఎయిర్‌టెల్..బ్లింకిట్‌తో జతకట్టిన విషయం తెలిసిందే. సెల్ఫ్-కేవైసీ ప్రాసెసింగ్, ఇతర విషయాలపై టెలికం శాఖ పలు అభ్యంతరాలు వ్యక్తంచేయడంతో ఈ సేవలను ప్రస్తుతానికి నిలిపివేసినట్టు ఎక్స్‌లో వెల్లడించింది. హైదరాబాద్‌తో పాటు ఒకేసారి 15 నగరాల్లో సిమ్ డెలివరీ సేవలను ఏప్రిల్ 15న ప్రారంభించిన విషయం తెలిసిందే.